క్లుప్తంగా

ప్రతి రైతుకు యూరియా పంపిణీ చేయాలి



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ భావన

నందలూరు : రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన మండలంలోని నందలూరు రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. వివిధ రైతు సేవా కేంద్రాలలో యూరియా పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. పై అధికారుల ఆదేశాల మేరకు ప్రతి రైతు దగ్గర ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాన్ని పరిశీలించి ప్రతి రైతుకు ఒక బ్యాగ్ చొప్పున యూరియాను పంపిణీ చేస్తున్నట్లు సబ్‌కలెక్టర్‌కు మండల వ్యవసాయాధికారి మల్లికార్జున వివరించారు. యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. అంతకు ముందు నాగిరెడ్డిపల్లి పంచాయతీ అరవపల్లిలోని చౌకదుకాణాన్ని ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రేషన్ పంపిణీ వివరాలను ప్రజల వద్ద ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాకృష్ణన్, తహసీల్దార్ అమరేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వాన దారి.. పట్టించుకునేవారేరి?



అధ్వానంగా సుండుపల్లె - పెద్దబలిజపల్లి రోడ్డు

సుండుపల్లె : అధ్వాన దారిలో ప్రయాణం చేయలేక ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. మండల కేంద్రం నుంచి పెద్ద బలిజపల్లి, సామిసేనిగడ్డకు వెళ్లే రహదారి గుంతలమయమై వాహనదారులు రోజూ అవస్థలపాలవుతున్నారు. ఈ రహదారిలో 5 గ్రామాల ప్రజలు నిరంతరం రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రహదారిలో స్కూల్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిరతరం తిరుగుతూ ఉంటాయి. ఇక వర్షం పడితే వర్షపు నీరు ఆ గుంతలలో నిల్వ ఉండి కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీలు లేకుండా పోతోందని ప్రజలు ఆవేదన పడుతున్నారు. రాజకీయ నాయకులు, అధికారులకు సమస్యను పరిష్కరించమని తెలియజేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, కూటమి పార్టీల నాయకులు చొరవచూపి రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు విన్నవిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించండి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, గ్రామస్తులు

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లి అరుంధతివాడ సమస్యలు పరిష్కరించాలని గురువారం సబ్ కలెక్టర్ భావనకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రహారం, కాపుపల్లి గ్రామాల్లో ప్రజలు రేషన్ తీసుకోవాలంటే నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయానికి వెళ్లాల్సి వస్తోందని, కావున వారికి గ్రామంలోనే రేషన్ తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పరిహారాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గల్లా శ్రీనివాసులు, ఎస్.రఘురాం రెడ్డి, చిన్ని కృష్ణారెడ్డి, ఎం.రాజయ్య పాల్గొన్నారు.

రేషన్ షాపులపై విజిలెన్స్ దాడులు



రేషన్ షాపు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ రేషన్ షాపులపై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. గురువారం రాయచోటి పట్టణంలోని 10వ నంబర్ రేషన్ షాపులో కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నాయకుల నారాయణ, డీసీటీఓ బాబు మోజెస్, టిప్పు సుల్తాన్‌లు దాడులు చేసి రూ.2.63లక్షల విలువ చేసే బియ్యం, చెక్కరను సీజ్ చేశారు. ఈ షాపులో 5,362 బస్తాల రేషన్ బియ్యం, 341 కిలోల చెక్కర ఉన్నట్టు గుర్తించారు. ఈ షాపు అంజద్ అలీ అనే డీలర్‌కు చెందినదిగా గుర్తించారు. అయితే డీలర్‌కు బదులుగా మరో వ్యక్తి రేషన్ షాపు నడుపుతుండటాన్ని గుర్తించిన అధికారులు కేసు నమోదు చేసి బియ్యం, చెక్కరను సీజ్ చేశారు.

వైభవంగా గణనాథుడి శోభాయాత్ర

రాజంపేట టౌన్ : గణనాథుడి నిమజ్జన వేడుకలు శోభాయమానంగా సాగుతున్నాయి. తొమ్మిదవ రోజు అయిన గురువారం రాజంపేట పట్టణంతో పాటు మండలంలోని అనేక ఉత్సవ కమిటీలు వినాయక నిమజ్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో గణనాథుడు ఊరేగింపుగా నిమజ్జనానికి తరలుతున్న సందర్భంగా మహిళలు కోలాటం చేస్తూ సాగారు. అలాగే యువకులు డ్రమ్స్, వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. దారిపొడవునా పెద్దఎత్తున బాణసంచాలు పేల్చారు. దీంతో అనేక ప్రాంతాల్లో కోలాహల వాతావరణం నెలకొంది.

సంబేపల్లెలో..

సంబేపల్లె : వివిధ గ్రామాలలో కొలువైన గణనాథ ప్రతిమలను నిమజ్జనానికి గురువారం తరలించారు. ఆయా గ్రామాలలోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణపతి విగ్రహాలను పురవీధులలో బాణసంచాలు కాలుస్తూ, డప్పు వాయిద్యాల నడుమ నిమజ్జన వేడుకలను నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, యువత జై బోలో గణేష్ మహరాజ్‌కి జై అంటూ నినదించారు. ఆయా గ్రామాలలోని చెరువులు, కుంటలు వాగులలో ఉన్న నీటిలో గణనాథుల విగ్రహాలను నిమజ్జనం చేశారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాదాలను అందించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు కల్పించారు.

రామాపురంలో..

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం నల్లగుట్టపల్లె గ్రామం కర్ణపువాండ్లపల్లెలో గురువారం నిర్వహించిన వినాయక



రాజంపేట టౌన్: నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

నిమజ్జన మహోత్సవంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి కరుణా కటాక్షాలతో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా, జాగ్రత్తగా నిర్వహించుకోవాలని ఆయన యువతను కోరారు.

పాత రాయచోటిలో..

రాయచోటి జగదాంబసెంటర్ : గణనాథుని ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. రాయచోటి పట్టణం పాతరాయచోటిలో కొలువుతీరిన గణపతి మండపాన్ని గురువారం శ్రీకాంత్‌రెడ్డి సందర్శించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు గావించారు. తీర్థప్రసాదాలు అందించి శ్రీకాంత్‌రెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు. స్థానిక కౌన్సిలర్ గువ్వల లక్ష్మీదేవి, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని శ్రీకాంత్‌రెడ్డి చేతుల



రాజంపేట టౌన్: శోభాయాత్రలో మహిళల కోలాటం

మీదుగా ప్రారంభింపజేశారు. అనంతరం వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త గువ్వల జగదీశ్ నివాసంలో ఇచ్చిన తేనీటి విందును శ్రీకాంత్‌రెడ్డి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తబ్రేజ్, సీనియర్ నాయకులు అష్రఫ్ అలీఖాన్, అన్నాసలీం, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయభాస్కర్, కొత్తిమీర ప్రసాద్, రాజగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ తిరుపాల్‌నాయుడు, ట్రేడ్ యూనియన్ అశోక్, పట్టణ యూత్ అధ్యక్షుడు కొత్తపల్లి ఇంతియాజ్, జగన్, సాకే రెడ్డి ఆంజనేయులు, నాగసుబ్బయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కోలాటం, నృత్యాలు నడుమ..

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేట బజారు వీధి, జంగాలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వినాయక విగ్రహాలకు నిమజ్జనం వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసి తొమ్మిది రోజులు పాటు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. విగ్రహాల ఊరేగింపులో కోలాట నృత్యాలు, భజనలు అలరించాయి. దిగువపేట బజారు వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద లడ్డూ వేలంలో గిద్దలూరు సుబ్రమణ్యం రూ.70 వేలకు దక్కించుకున్నారు.



సంబేపల్లె: మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై నిమజ్జన కోలాహలం

గంగమ్మ ఒడికి గణనాథుడు

సుండుపల్లె : వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మండల వ్యాప్తంగా వందలాది విగ్రహాలను గ్రామాల్లో ఏర్పాటు చేసి గత 9 రోజులుగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించారు. గురువారం వినాయకుని ప్రతిమలను నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. గురువారం మండల కేంద్రంతో పాటు కొండ్రెడ్డిగారిపల్లె, పలు ప్రాంతాలలో వినాయకుని విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వసంతాలు చల్లుకుంటూ..

రాయచోటి టౌన్ : వినాయకుడి నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా మంటపాల నుంచి వినాయకుడిని నిజమజ్జనం చేయడానికి సమీపంలోని చెరువు వద్దకు తీసుకెళ్లారు. మంటపాల వద్ద నుంచి వినాయకుడిని వీధుల వెంట మెరవణిగా తీసుకెళ్లారు. మంటపం వద్ద నుంచి కార్యనిర్వాహకులు వసంతాలు చల్లుకొంటూ డబ్బు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ కేరింతలు కొడుతూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. 9వ రోజు కావడంతో దాదాపుగా 100కు పైగా నిమజ్జనాలు చేశారు.



నందలూరు: లడ్డూను దక్కించుకున్న దాసరి ప్రసాద్

వేలంలో రూ.1.15లక్షలు పలికిన లడ్డూ

నందలూరు : మండలంలోని నీలిపల్లి గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన లడ్డూ వేలంపాటలో రూ.1.15 లక్షల ధర పలికింది. అదే గ్రామానికి చెందిన దాసరి గంగులయ్య కుమారుడు ప్రసాద్ వేలంలో లడ్డూను దక్కించుకున్నారు.



రాయచోటి జగదాంబసెంటర్: అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి



రామాపురం మండలంలో వినాయక నిమజ్జన కార్యక్రమంలో..



సిద్దవటం : దిగువపేట బజారు వీధి వినాయకుడి నిమజ్జనం



సుండుపల్లె : నిమజ్జనానికి తరలుతున్న బొజ్జ గణపయ్య



రాయచోటి టౌన్: నిమజ్జన వేడుకలో వసంతాలు చల్లుకుంటున్న యువకులు

సమాజానికి మూల స్తంభాలు టీచర్లు



రాజంపేట: డా.సర్వేపల్లె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అన్నమాచార్య ఫార్మసీ కళాశాల అధ్యాపకులు



పుల్లంపేట: గురుపూజోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



పెనగలూరు మండలం చక్రంపేట జెడ్పీహెచ్ఎస్‌లో..

రాజంపేట : రాజంపేట అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో గురువారం టీచర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.స్వర్ణలత మాట్లాడుతూ సమాజానికి ఉపాధ్యాయులు మూలస్తంభాలన్నారు. ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శకుడని తెలియజేశారు. గురువును దైవంగా భావించి వారు చెప్పే బోధనలతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బాటవేస్తాయని పేర్కొన్నారు.

దళవాయిపల్లె పాఠశాలలో..

పుల్లంపేట : మండలంలోని దళవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు రమణ మాట్లాడుతూ ప్రతి ఏడాది సెప్టెంబర్ 5వ తేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకోవడం జరుగుతోందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప పండితుడు, తత్వవేత్త, భారతదేశ రెండో రాష్ట్రపతి అని, విద్యకు, ఉపాధ్యాయ వృత్తికి ఆయన చేసిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. ఉపాధ్యాయుల కృషి వల్ల విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని వారు తెలియజేశారు.

పెనగలూరులో..

పెనగలూరు : చక్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవం సందర్భంగా ముందస్తుగా గురువారం పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణ మాట్లాడుతూ భారత రాష్ట్రపతిగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎన్నికై దేశానికి అనేక సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్వర్ బాషా, కృష్ణకుమారి, ప్రమీల, పరిమళ, శ్రీవాణి, పీఎస్ఎల్‌బీ ప్రసాద్, సతీష్ బాబు, సుదర్శన్, మహేంద్ర, దేవమణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గురువులే సమాజ మార్గదర్శులు



గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు జీవితానికి బాటలు వేసే మహోన్నతులని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా పాటించడం మనదేశ సంస్కృతి, విలువల పట్ల గౌరవానికి నిదర్శనమని గురువారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశానికి గర్వకారణమైన తాత్వికవేత్త, విద్యావేత్త, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కేవలం పాఠాలు చెప్పిన వ్యక్తి కాదని, జీవితం ఎలా గడపాలో, ఆత్మవిశ్వాసం ఎలా పెంచుకోవాలో నేర్పించిన మార్గదర్శి అన్నారు. గురువు లేకుంటే విద్యలేదు, విద్య లేనిదే వికాసం లేదని చెప్పారు. గురువులేని సమాజం వీధుల్లేని నగరం లాంటిదేనని అభివర్ణించారు. దేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో సర్వేపల్లి పాత్ర అమోఘమని కొనియాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తూ అమలు చేసిన అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, నాడు – నేడు వంటి ప్రతిష్టాత్మక పథకాల విజయవంతం కావడానికి ఉపాధ్యాయుల సహకారం ఎనలేనిదని పేర్కొన్నారు. విద్యార్థులు రేపటి పౌరులని, వారి జీవితాలను తీర్చిదిద్దే శిల్పులు గురువులే అన్నారు. అటువంటి వారిని గౌరవించడమే మన సంస్కృతి అని తెలియజేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా నివాళులర్పిస్తూ దేశ వ్యవస్థను ముందుకు నడిపిస్తున్న ఉపాధ్యాయ సమాజానికి అభినందనలు, శుభాకాంక్షలను శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

విద్యారంగ సమస్యలు 'కూటమి'కి పట్టడంలేదు

రాయచోటి టౌన్ : విద్యారంగ సమస్యలు కూటమి పట్టడంలేదని, దీనికి నిరసనగా ఈ నెల 6వ తేదీన ఛలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సతీష్ తెలిపారు. గురువారం రాయచోటి జూనియర్ కళాశాల ఎదురుగా ఛలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు ఉన్నాయన్నారు. వీటిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే జీఓ నంబర్ 77ను కూడా వెంటనే రద్దు చేయాలని కోరారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలలో ఒకటి కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. వీటిపై అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను విద్యార్థి సంఘాలను విద్యాసంస్థల్లోకి ప్రవేశించకుండా నిషేధిస్తూ ఇచ్చిన జీఓను ఉపసంహరించాకోవాలని హెచ్చరించారు. ఛలో విజయవాడను విజయవంతం చేయడానికి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తనిఖీ సమాచారంతో దుకాణాల మూత

గాలివీడు : సేల్స్ అధికారుల రాకతో వ్యాపారులు చడీచప్పుడు కాకుండా దుకాణాలు మూసివేశారు. మండల కేంద్రమైన గాలివీడు పట్టణంలో గురువారం మధ్యాహ్నం సేల్స్ ట్యాక్స్ అధికారులు దుకాణాలను తనిఖీ చేసేందుకు వచ్చారు. పట్టంలోని ఓ దుకాణం వద్ద కారు నిలిపి దుకాణాన్ని తనిఖీ చేసేందుకు విజిలెన్స్ అధికారులు వెళ్లారు. విజిలెన్స్ అధికారులు వచ్చారన్న సమాచారం తెలుసుకున్న వ్యాపారులు హోటళ్లు, దుకాణాలు, జనరల్ స్టోర్లు, నిత్యావసరాల సరుకుల దుకాణాలను చడీచప్పుడు కాకుండా మూసివేశారు. ఒకటి రెండు దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు గ్రామం నుంచి వెళ్లిపోయినా తిరిగి మళ్లీ వస్తారో ఏమోనన్న భయంతో దుకాణాలను తెరవకుండా వ్యాపారులు మెయిన్ బజార్‌లో నిలబడి అధికారులు వెళ్లారా? లేక తిరిగి మళ్లీ వస్తారా? అని చర్చించుకోవడం కనిపించింది. దుకాణాలకు వచ్చే వినియోగదారులకు నిత్యావసరాల సరుకులను ఎమ్మార్పీ ధరలకు విక్రయిస్తే ఏ అధికారి వచ్చినా దుకాణాలు మూసే అవకాశం ఉండదని వ్యాపారులు ఇష్టానుసారంగా అధిక ధరలకు విక్రయిస్తుండటంతోనే అధికారులకు భయపడి దుకాణాలను మూసివేశారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.



పురస్కారాలకు ఎంపిక



ఎస్.శశికళ



కె.జయమ్మ

సంబేపల్లె : డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 5 (నేడు) ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు మండలం నుంచి ఇద్దరు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో కెమిస్ట్రీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న శెట్టిపల్లె శశికళ, సంబేపల్లె మండల కేంద్రంలోని ప్రైమరీ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న కె.జయమ్మలకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రామాపురం మండలం నుంచి ముగ్గురు..

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) :



నాగబసమ్మ



వెంకటసుబ్బయ్య



సువర్ణమ్మ

రామాపురం మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎస్. నాగబసమ్మ, పొత్తుకూరుపల్లి ఉపాధ్యాయుడు జీసీ వెంకటసుబ్బయ్య, నీలకంఠ్రావుపేట జెడ్పీహెచ్ఎస్‌లో హిందీ పండిట్ సువర్ణమ్మలు ఎంపికయ్యారని ఎంఈఓ తెలియజేశారు.

ఉత్తమ ప్రిన్సిపల్‌గా రమేష్



వి.రమేష్, ప్రిన్సిపల్



రాజశేఖర్, జువాలజీ

లక్కిరెడ్డిపల్లి : ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న వర్ల రమేష్ ఉత్తమ ప్రిన్సిపల్‌గా, జువాలజీ పీజీటీ రాజశేఖర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. వీరు శుక్రవారం రాయచోటిలో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, డీఈఓ సుబ్రమణ్యం చేతులమీదుగా ఉపాధ్యాయులు అవార్డును అందుకోబోతున్నారు.

చంద్రబాబుకు రైతుల ఉసురు తగలక తప్పదు

- యూరియా దొరక్క రైతుల ఆందోళన
- 9న రాయచోటిలో నిరసన కార్యక్రమం
- విజయవంతం చేయాలంటూ వైఎస్సార్‌సీపీ రైతు విభాగం పిలుపు



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

రాజంపేట టౌన్ : సీఎం చంద్రబాబునాయుడుకు రైతుల ఉసురు తగలక తప్పదని వైఎస్సార్‌సీపీ రాజంపేట నియోజకవర్గ రైతు విభాగం కన్వీనర్ కొత్తమద్ది వెంకటసుబ్బయ్య తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా రైతులకు యూరియా దొరకడం లేదన్నారు. ప్రస్తుతం రైతులు పంటలు సాగు చేసుకునే తరుణమన్నారు. అలాగే వర్షాలు కురుస్తున్నందున పంటల సాగుకు ఇది సమయమైతే యూరియా దొరకకపోవడంతో రైతులు పంటలు సాగు చేసుకోలేని దయనీయ దుస్థితిలో పడ్డారన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్ కూడా చెల్లించలేని దయనీయ దుస్థితికి చంద్రబాబు ప్రభుత్వం చేరుకుందని మండిపడ్డారు. వరదల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని విమర్శించారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో రైతులు మళ్లీ పంటలు సాగు చేసుకునేందుకు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని తెలియజేశారు. అప్పుచేసి పంటలు సాగు చేసుకుందామన్నా యూరియా దొరకని పరిస్థితి నెలకొనడంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావని ఈ సందర్భంగా గుర్తు చేశారు. యూరియా, క్రాప్ ఇన్సూరెన్స్, వరదల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం వంటివి సకాలంలో అందేవని తెలియజేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9వ తేదీ జిల్లా కేంద్రమైన రాయచోటిలో తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతులు, ప్రజానీకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ డి.భాస్కర్‌రాజు, వివిధ విభాగాల కన్వీనర్లు గోవిందు బాలకృష్ణ, జీవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్ పవర్ రద్దును న్యాయపరంగా ఎదుర్కొంటాం

- కూటమి నాయకుల కనుసన్నల్లోనే అధికారుల నివేదిక, చర్యలు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

ఒంటిమిట్ట : ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ 12 గ్రామాల సర్పంచ్‌ల అధికారాన్ని రద్దు చేయడాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి తప్పుబట్టారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అరాచకలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. మండలంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజాప్రతినిధులు ఉండకూడదనే ఉద్దేశంతో పక్కా ప్రణాళికతో ప్రభుత్వం, నియోజకవర్గ కూటమి నాయకులు అనైతిక చర్యలకు దిగుతుండటం మండల ప్రజలనే అవాక్కు గురిచేసేలా ఉందన్నారు. కూటమి నాయకుల ఆదేశాలను పాటిస్తూ ప్రజల చేత ఎన్నికైన వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌ల చెక్ పవర్‌ను కడప డీపీఓ రాజ్యలక్ష్మి రద్దు చేశారని ఆరోపించారు. పంచాయతీలో లేని నిధులను కూడా కాజేశారని చెబుతున్నారంటే వీరు ఎంతటి స్థాయిలో దిగజారి రాజకీయాలు చేస్తున్నారో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. కూటమి పార్టీల నియోజకవర్గ నాయకులు ఆదేశించిందే తడువుగా అధికారులు నివేదికలు తయారుచేసి చర్యలు తీసుకోవడం అప్రజాస్వామికమన్నారు. సర్పంచ్‌ల అధికారాల రద్దును న్యాయపరంగా పోరాడతామని, అలానే కూటమి నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలకు డిమాండ్ చేస్తామని స్పష్టం చేశారు. కూటమి కక్షపూరిత రాజకీయాలను మండల ప్రజలు గమనిస్తున్నారని వచ్చే రోజుల్లో తగిన రీతిలో గుణపాఠం చెబుతారని తెలియజేశారు.

హెచ్ఐవీపై యువతకు అవగాహన అవసరం

రాయచోటి జగదాంబసెంటర్ : హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై యువతీ యువకులకు అవగాహన అవసరమని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ 2025 – 26లో భాగంగా గురువారం 5కే రెడ్ రన్ మారథాన్ నిర్వహించారు.

ముఖ్య అతిథిగా జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, జిల్లా క్రీడాధికారి గౌస్‌బాషా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.మునియనాయక్, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌లు హాజరై జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. 5కె రన్ మారథాన్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నుంచి ప్రారంభమై చిత్తూరు రింగు రోడ్డు సర్కిల్ మీదుగా నారాయణరెడ్డిపల్లె దగ్గర యు టర్న్ తీసుకొని తిరిగి ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చేరుకోగా పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.రమేష్‌బాబు మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై మిత్రులకు, కుటుంబసభ్యులకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత విద్యార్థులపై ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ సమన్వయకర్తలు డా.బొమ్మల వెంకట్రావు, విశ్వప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఖాజా, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ జబీవుల్లా, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులు సాదిక్, వీసీఎస్ఎస్ ఎన్‌జీఓ ప్రాజెక్టు డైరెక్టర్ చెన్నారెడ్డి, ప్రాజెక్ట్ సిబ్బంది, ఐసీటీసీ స్టాఫ్ నర్స్ మధుబాబు, ల్యాబ్ టెక్నీషియన్ శంకర్, లింక్ వర్కర్ అల్లావలీ, సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ, వివిధ కళాశాలల అధ్యాపకులు, క్రీడా శిక్షణ అధికారులు పాల్గొన్నారు.